క్లుప్తంగా

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండన్న

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీడీఓ కొండన్న సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కొత్త నిర్ణయాలు తీసుకోకుండా తాగునీరు, ఉపాధిహామీ పనులు, విద్యుత్, పశుగ్రాసం వంటి అత్యవసర సేవలపై అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కొండన్న మాట్లాడుతూ.. కోడ్ ఉన్నందున పై నాలుగు అంశాలపై అధికారులతో చర్చించి సమావేశాన్ని ముగిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సూపరింటెండెంట్ అనసూయమ్మ, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి



జల్లా దేవి (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన జల్లా దేవి (35) అనే మహిళ కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 17వ తేదీన కుమారుడితో కలిసి జల్లా దేవి బైక్‌పై ఆదోనిలోని బంధువుల ఇంటికి బయలుదేరింది. ఇస్వి సమీపంలో స్పీడ్ బ్రేకర్‌పై వేగంగా వెళ్లడంతో ఆమె అదుపుతప్పి కిందకు పడిపోయింది. తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి వైద్య సేవలు అందించినా కోలుకోలేక మృతి చెందింది. మంగళవారం గ్రామంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతిరాలికి భర్త హనుమంతు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యురాలు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

జీవనశైలి మార్పులే రక్తపోటుకు కారణం



వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ హేమలత

కల్లూరు: జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణమని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమ అధికారిని డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కె.మార్కాపురంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనరోజు వారి ఆహారపు అలవాట్లు, వ్యాయమమంతో రక్తపోటుకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. బీపీ (రక్తపోటు), మధుమేహం ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్, సామాజిక ఆరోగ్య అధికారి ఫరీదా, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- చెట్టులో చొచ్చుకుపోయిన విద్యుత్ తీగలు



చెట్టు కొమ్మల మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలు

ఆలూరు రూరల్: ఆలూరు–హొళగుంద రహదారిలోని బిలేహాల్ బస్ స్టేజ్ సమీపంలో ఉన్న దానిమ్మ తోట వద్ద చింత చెట్టులోకి 11 కేవీ ఫీడర్ విద్యుత్ తీగలు చొచ్చుకుపోయి ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తూ..ఈ చెట్టు కింద సేదతీరుతూ ఉంటారు. వర్షాకాలం కావడంతో గాలీవాన వచ్చినప్పుడు చెట్టు కొమ్మలపై వేటాడుతున్న విద్యుత్ తీగల వల్ల చెట్టుకు కరెంటు సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. 11 కేవీ విద్యుత్ ఫీడర్ నుంచి హాలహర్వి మండలంలోని బిలేహాల్, నిట్రవట్టి గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. గాలికి విద్యుత్ తీగలు చెట్టు కొమ్మలకు తాకి బ్రేక్ డౌన్ అవుతుండడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రీ కటింగ్ చేసి తీగలు సరిచేయాలని గ్రామస్తులు, ప్రయానికులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఏజెంట్లు మే చివరిలోపు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- ఆదోని నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, 19 రౌండ్లు
- ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ కోరారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్‌ను పర్యవేక్షించేందుకు మే నెల చివరిలోపు ఫారం–18 ద్వారా ఏజెంట్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదోని నియోజకవర్గానికి సంబంధించి 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా 14 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, 19 రౌండ్ల కౌంటింగ్ జరుగుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఆ తర్వాత ఈవీఎం మిషన్లలో పోలైన ఓట్లను లెక్కిస్తారని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి ఒక టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లను జిల్లా ఎన్నికల అధికారి రాండమైజేషన్ పద్ధతి ద్వారా కేటాయిస్తారన్నారు. మే 24, 31వ తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంపీడీఓ (ఇన్‌చార్జ్) విజయశేఖర్‌రావు, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, సీఐలు నిరంజన్‌రెడ్డి, గోపి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

కౌతాళం: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ అమరేష్, ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందని ఎంపీపీ, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని అన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కౌతాళంలో విద్యుత్ స్తంభాల సమస్య ఉందని సర్పంచ్ పాల్‌దినకర్, ఏరిగేరి సర్పంచ్ గోవిందులు ట్రాన్స్‌కో ఏఈ నర్సప్పను నిలదీశారు. ఈ సమస్య తమ గ్రామంలో కూడ ఉందని మల్లనహట్టి సర్పంచ్ అన్నారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏఈని నాయకులు కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరుగుతున్నాయని, ఎవరూ వలసలు వెళ్లకుండా ఉపాధి పనులకు రావాలని ఎంపీడీఓ, ఏపీఓలు కోరారు. వైద్యాధికారి బాలమురళీకృష్ణ మండలంలో అందుతున్న వైద్య సేవల గురించి వివరించారు. పలువురు అధికారులు మండల సమావేశానికి గైర్హాజరయ్యాని వారిపై చర్యలు తీసుకోవాలని కో–ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ ఫిర్యాదు చేశారు. వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, లిఖిత, మండల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి బాలమురళీకృష్ణ

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు నేటి సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సూచించారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ కోసిగి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉంటాయని, ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందని వెల్లడించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెల్దుర్తి మండలం గుంటుపల్లె గ్రామానికి చెందిన వడ్డె ధనాంజనేయులు(31) కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ధనాంజనేయులు తాగుడుకు బానిస అయ్యాడు. మరోపక్క రూ.6 లక్షల అప్పు చేశాడు. వీటిని తీర్చే దారి లేక ఈనెల 10న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితం వివాహం కాగా భార్య ప్రస్తుతం గర్భిణి. మృతుడి సోదరుడు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

మద్దికెర: కోతల తరువాత పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడంతో సేంద్రియ ఎరువుగా మారి భూమి సారవంతం అవుతుందని ఏఓ రవి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్బీకేలో తొలకరి సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరణకు, భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని, రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. ఫలితాలను బట్టి పంటను సాగుచేసుకోవాలన్నారు. విత్తన ఎంపికలో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. శుద్ధి చేసిన విత్తనాలను అనుమతులున్న డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు జాకీర్, ఆనంద్ ఉన్నారు.

పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకుంటాం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగానూ పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకుంటామని ఆర్వో అస్లాంబాషా మంగళవారం తెలిపారు. ఆస్తి పన్ను ఏడాదికి రూ.16 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, రూ.11 కోట్లను వసూలు చేసి 75 శాతం మేర లక్ష్యాన్ని సాధించామన్నారు. నీటి పన్ను వసూళ్లలో రూ.8.50 కోట్లు లక్ష్యం కాగా, రూ.4 కోట్లు వసూలు చేసి 50 శాతం మేర పన్నులు వసూలు చేశామని ఆర్వో చెప్పారు. జిల్లాలో ఆదోని మున్సిపాలిటీ రెండోస్థానంకు చేరుకుందన్నారు. నీటి పన్ను బకాయిలు ఉన్న యజమానులు సకాలంలో చెల్లించాలని, లేనిపక్షంలో కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని చెప్పారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వంద శాతం పన్నుల వసూలుకు చర్యలు

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్లలో ఇంటి, కొళాయి, షాపుల పన్నులు చెల్లించాలని ఇన్‌చార్జ్ ఈఓ సతీష్ కోరారు. ఆయన మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ 2023–24కు సంబంధించి ఇంటి, కొళాయి, షాపుల పన్నులు చెల్లించని వారు ఈనెల 30వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పన్నులను తమ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 70 శాతం పన్నులను వసూలు చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది వంద శాతం పన్నులు వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బైబిల్ పాఠశాల



కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

ఆదోని సెంట్రల్: వేసవి సెలవులను పురస్కరించుకుని చిన్నారులకు విరామ బైబిల్ పాఠశాల కార్యక్రమాన్ని స్థానిక సయోను ప్రార్థన మందిరంలో అట్టహాసంగా ప్రారంభించారు. మంగళవారం పాస్టర్ తిమోతి, దైవసేవకురాలు బ్లెస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న వీబీఎస్‌కు ఆయా గ్రామాల నుంచి చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. పిల్లలు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, జ్ఞానం వృద్ధి చెందేలా చూడాలన్నారు. చిన్న పిల్లలను నా వద్దకు రానీయండి ఇలాంటి వారిదే పరలోక రాజ్యమని యేసు ప్రభువు సెలవిచ్చారని వివరించారు. పిల్లల్లో ఎలాంటి కల్మషం, కుతంత్రాలు ఉండవు గనుక వారి జీవన విధానంలో మంచి నడవడిక కలిగి ఉండేలా నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐదు రోజులు పాటు కార్యక్రమం జరగుతుందన్నారు. పిల్లలకు మంచి క్రమశిక్షణతో పాటు జ్ఞానాభివృద్ధి పొందే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. పాటలు, సంగీత వాయిద్యం, కథలు పిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సయోను ప్రార్థన మందిరం సంఘ పెద్దలు, విశ్వాసులు, ఆయా ప్రాంతాలకు చెందిన పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి




విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎమ్మిగనూరురూరల్: పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని బనవాసి కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ అశోక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దివాకర్‌రెడ్డి, అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తు సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసిన తర్వాతే పొలంలో విత్తుకోవాలని చెప్పారు. పంటల సాగులో ఏమైనా సందేహాలుంటే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో రైతులతో కలసి పొలాలకు వెళ్లి పరిశోధన చేశారని చెప్పారు. అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. రైతులు, శాస్త్రవేత్తలు స్టాల్స్‌ను పరిశీలించారు. సదస్సులో కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ కాలేజీ విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని కాచి చల్లార్చుకుని తాగాలి

సి.బెళగల్: నీటిని కాచి, వడబోసుకుని చల్లారిన తర్వాత తాగాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ నదీతీర గ్రామాల్లోని ప్రజలు కలుషినీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీల ద్వారా సరఫరా అయ్యే నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



జీడీపీ స్టేజ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణయ్య

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్ట్ స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనం నడపరాదన్నారు. పెండింగ్ చలానాలు ఉన్నవారు వాటిని చెల్లించకుండా రోడ్డుపై వాహనంతో ప్రయాణిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్థానిక పోలీసులు ఉన్నారు.

నరసింహస్వామి జయంతి వేడుకలు



సుదర్శన హోమంలో పాల్గొన్న ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్, ఈఓ, అర్చకులు



అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి



వెండి అలంకరణలో పూజలందుకుంటున్న స్వామివారు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో ఒకటైన ఉరుకుందలో వెలసిన ఈరన్న (నరసింహ)స్వామి దేవాయలంలో మంగళవారం నరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను పవిత్ర జలాలతో శుద్ధి చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేష్, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆలయ ప్రాంగణంలో గోపూజ చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి సుదర్శన హోమంను వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌ను వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేపట్టి తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆదోని అర్బన్: పట్టణశివారు మంగరాయ కాలనీలో వెలసిన ఆంజనేయస్వామి సన్నిధిలో నరసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా నరసింహస్వామి విగ్రహానికి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తేనాభిషేకం, ఆకుపూజ, వెండి అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ పూజారి గురురాజ ఆచారి, నిర్వాహకులు నఖతే శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో ఎమ్మెల్యే

మంత్రాలయం: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహా స్వామిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి కాచాపురం సర్పంచ్ జయమ్మ దర్శించుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేకువజామున నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అర్చకులు వారికి స్వామివారి ఫల,పూలమంత్రాక్షింతలు అందించి ఆశీర్వదించారు.

ఈదురు గాలుల బీభత్సం

– నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు





చెన్నంపల్లి వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు

ఆస్పరి: మండలంలోని చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి గ్రామాల మధ్య మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అక్కడక్కడా చెట్లు విరగడపడటంతో విద్యుత్ తీగలు దెబ్బతిన్నాయి. ఫలితంగా కైరుప్పల, చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి, కారుమంచి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలకు బుధవారం మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ మలికార్జున తెలిపారు.

వేడుకగా శాంతియజ్ఞ మహోత్సవం



మారెమ్మవ్వ గుడిలో శాంతియజ్ఞంలో పాల్గొన్న నాయకులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన మోరెమ్మవ్వ దేవాలయంలో గత మూడు రోజులుగా శాంతియజ్ఞ మహోత్సవంను గ్రామ పెద్దలు ఘనంగా చేపట్టారు. త్రయోదశి మంగళవారం తెల్లవారుజాము నుంచి వేద పండితులు ఆలయ పూజార్లు కృష్ణ సునీత, శీను యల్లమ్మ దంపతులచే అమ్మవారికి జలాభిషేకం, వస్త్రాభరణం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి యజ్ఞ హోమం గావించి పూర్ణాహుతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం పూజారి నరసింహ, హనుమంతు, కురువ వీరనాగుడు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. యజ్ఞ మహోత్సవానికి గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మమ్మవ్వ ఆలయ పూజారి విశ్వబ్రాహ్మణ నరసింహాచారి, నాయకులు బ్రహ్మయ్యాచారి, కేశవాచారి తదితరులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి ఉరుసు



దర్గాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ఖాదర్‌లింగ స్వామి సన్నిధిలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దర్గాల్లో ఒకటి. కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 320వ ఉరుసు మహోత్సవం మంగళవారం కనులపండుగగా జరిగింది. ఉత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. తెల్లవారు జామున 3గంటల నుంచి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేనిచిష్తీ ఇంటి నుంచి గంధం బయలు దేరి డప్పువాయిద్యాలు, బ్యాండుమేళాల మధ్య దర్గాకు చేరింది. ఈ సందర్భంగా పక్కీర్ల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీ, ధర్మకర్త గంధంను స్వామి వారి సమాధికి పూయడంతో ఉరుసు కార్యక్రమాలు ఘనంగా కొనసాగినట్లు ప్రతీక. ఉత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున ప్రారంభమైన రద్దీ రాత్రి వరకు తగ్గలేదు. దర్శనం కోసం భక్తులు గంటకుపైగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఎర్పడింది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తరలివచ్చిన పీఠాధిపతులు

గంధం ఉత్సవానికి వివిధ దర్గాల పీఠాధిపతులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. బీదర్ దర్గా పీఠాధిపతి, రాయచూర్, సింధనూర్ దర్గా పీఠాధిపతులు, కర్నూలు ఖాలిక్‌లింగ పీఠాధిపతి, వివిధ దర్గాల పీఠాధిపతులు తరలివచ్చారు. కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు దూద్‌బాషా పలువురు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి సహకారం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఖాదర్‌లింగ స్వామి దర్గాను అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఉరుసు సందర్భంగా ఆయన సతీమణి వై.జయమ్మతో కలిసివచ్చి చాదర్, పూలను సమర్పించారు. వారికి ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించిన అనంతరం పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఖాదర్‌లింగ స్వామి ఆశీస్సులతో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఖాదర్‌లింగ స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. కౌతాళం మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్ పాల్‌దినకర్ తదితరులు వెంట ఉన్నారు.



సమాధికి గంధం పూస్తున్న దృశ్యం



దర్గా వద్ద పకీరు విన్యాసం



స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



భక్తుల కోలాహలం